# క్షమించు సుప్రియా!

రెండు నిమిషాలకి ప్రొఫెసర్ గౌరీనాథ్ కారు పోర్టికోలోకి వచ్చి ఆగింది. ఆరోజు ఆయన ఇంటికి చేరుకోవటంలో జరిగిన పన్నెండు నిమిషాల ఆలస్యానికి కారణం ఆయన చేతిలోవున్న పెద్ద బౌండు పుస్తకం. ఆ అనాటమీ పుస్తకాన్ని ఆయన తన తమ్ముడికోసం ఒక సెకండ్ హాండ్ షాపులో, ఆ షాపువాడితో పదకొండు నిమిషాలు దెబ్బలాడి మరీ కొన్నాడు.

ఆ పదకొండు నిముషాల్లోనూ ఆయన తన క్వాలిఫికేషన్ సంగతి చెప్పి, దాదాపు అర నిమిషాలపాటూ ఆ షాపువాడికి మనస్తత్వాలమీదా, మానవుడి బలహీనతలమీద చిన్న సైజు లెక్చరిచ్చేడు. వాడు తననేమీ మోసం చెయ్యలేడనే విషయాన్ని ఆయన విపులీకరిస్తుంటే శ్రద్ధగా, మిగతా కస్టమర్స్‌ని వదిలేసి మరీ ఆయన చెప్పింది విన్నాడు.

"చూడవోయ్! నీలాంటి వాళ్ళని చాలామందిని స్టడీ చేసేన్నేను, కష్టమర్ రాగానే మామూలు ధర కన్నా దాదాపు రెట్టింపు ధర చెప్పేసి, ఆ కొనేవాడి మనసులో అసంతృప్తి కలిగించటం, ఆ పైన ఆ ధరని కొద్దిగా తగ్గించి, ఆ కొనేవాణ్ని ఒకరకమైన 'ట్రాన్స్'లో పెట్టేసి, ఆ పుస్తకాన్ని అమ్మేయటం మీకు వెన్నతో పెట్టిన విద్య అయితే, అయి ఉండవచ్చు కానీ, ఈ ప్రయోగం నామీద చెయ్యలేవు. కాబట్టి నా అమూల్యమైన సమయాన్ని వృథా చెయ్యకుండా ఒకే ధర చెప్పు"—ఇలా సాగింది ఆయన సంభాషణ.

ఆ షాపువాడి మనసులో ఈయన చెప్పిన మాటలు చాలా సూటిగా నాటుకొన్నాయి. అతని కళ్ళకి ఈయనో ఋషిలా కనబడ్డాడు. చాలా భక్తితో ఆ పుస్తకాన్ని అందిస్తూ "రెండు రూపాయలు తగ్గించుకోండి, సార్. కానీ, దయచేసి ఈ విషయాన్ని మాత్రం ఎక్కడా చెప్పొద్దు" బ్రతిమాలేడు.

ఆ షాపువాడి కళ్ళలో కనపడే నమ్రతా భావాన్ని గౌరీనాథ్ తీక్షణమైన కళ్ళు వెంటనే పసిగట్టేయి. ఆయన కళ్ళు గర్వంగా నవ్వేయి. అనూహ్యమూ, అభేద్యమూ అయిన ఆ షాపువాడి అంచనాల్ని పటాపంచలుచేసి ఆ పుస్తకాన్ని రెండు రూపాయలు తక్కువకికొన్న సంతృప్తి ఆయన కళ్ళలో ప్రతిబింబించింది.

తను విపులీకరించిన పద్ధతిలోనే షాపువాడు తనని మోసం చేసేడని గుర్తించని గౌరీనాథ్, కార్లో పుస్తకాన్ని పెట్టుకొని ఇంటి కొచ్చేసేడు.

★ ★ ★ ★

అదే సాయంత్రం-ఆరయింది.

స్నానంచేసి డ్రాయింగ్ రూమ్‌లో టీ త్రాగుతూ కూర్చున్నాడు గౌరీనాథ్. ఆయన ఎదుట బల్లమీద అందంగా అట్టవేసిన బౌండు పుస్తకం కనపడుతూ వుంది. పక్కనే రాక్‌నిండా సైకాలజీమీద వ్రాసిన పుస్తకాలున్నాయి.

కిటికీలోంచి బయటికి చూస్తూ, అప్రయత్నంగా ఆ అనాటమీ పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకొన్నాడు. అందులో బొమ్మల్నిచూస్తూ, అక్కడక్కడ చిన్న చిన్న పేరాలు చదువుతూ, దాదాపు అరగంట గడిపేడు. అంతలో నౌకర్ ఎవరో వచ్చేరని చెప్పేడు.

పుస్తకాన్ని మూసేసి లేవబోతున్న ప్రొఫెసర్ గౌరీనాథ్ చటుక్కున ఆగిపోయేడు. అతని సునిశితమైన దృష్టికి ఆ పుస్తకం అట్ట వెనకభాగం ఎత్తుగా కనబడింది. వ్రేళ్ళతో తడిమిచూసి, ఆ పుస్తకానికి వేసిన కవర్‌లో ఏదో కాగితం ఉన్నట్టు గ్రహించేడు.

విజిటర్‌తో మాట్లాడుతున్నంతసేపూ ఆయన దృష్టి ఆ పుస్తకం మీదేవుంది. అతడు వెళ్ళిపోగానే చటుక్కున ఆ పుస్తకాన్ని చేతుల్లోకి తీసు కొని, కవర్ విప్పేడు. అందులోంచి మడత పెట్టివున్న చిన్న కాగితం జారిపడింది. విప్పి చూసేడు. అందులో ఇలా వుంది.

"డియర్ రావ్,

దాదాపు పదిరోజులనుంచీ నిన్ను కలుసుకోవాలని ప్రయత్నిస్తు న్నాను. కానీ వీలు కుదరటంలేదు. నా పెండ్లి గురించి మా ఇంట్లో తొందరపడుతున్నారు. కనీసం నా ఎమ్.బి. పూర్తయ్యేవరకూ కూడా ఆగేటట్టులేరు. ఇటువంటి పరిస్థితుల్లో మనకొకటే మార్గం.

ఈ ఉత్తరం నేనేదో ఆవేశంలో వ్రాయడంలేదు. అన్నీ ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. ఈ నిర్ణయాలపట్ల నాకు నమ్మకం వుంది.

మనం వెంటనే పెళ్ళిచేసుకోవాలి, రావ్. ఇప్పుడుగానీ మనం తెగించకపోతే మా ఇంట్లో వాళ్ళ ఒత్తిడికి నేను తట్టుకోలేను. ఇంకెవర్నో చేసేసుకోవాలి. తప్పదు.

నీకున్న క్వాలిఫికేషన్‌కి ఏదో ఉద్యోగం దొరక్కపోదు. నాకా ఈ చదువుపట్ల పెద్ద ఇష్టమేమీలేదు. ఇక్కడితో ఆపుచేసేస్తాను. ఒక గృహి ణిగా నా ఇంటిని సరిదిద్దుకోవటం, నీ కౌగిలిలో సేదదీరి విశ్రమించటం- యివే యిష్టం నాకు.

మొన్నే నన్ను చూసుకోవటానికి ఎవరో వచ్చేరు. ఈ సంబంధం సెటిల్ అయ్యేటట్టు వుంది. అదే నా భయం. మనం ఇంక తెగించాలి. ఇప్పుడుగానీ ఆ మాత్రం ధైర్యం చెయ్యకపోతే జీవితాంతం అందుకు చింతించవలసి వుంటుంది.

ఈ విషయంలో నీ నిర్ణయంకావాలి నాకు. సాయంత్రం మా కాలేజీ వాళ్ళు పిక్‌నిక్‌కి బయలుదేరుతున్నారు. నేనూ ఇంట్లో అలాగే చెప్పేను. చిన్న సూట్‌కేస్‌తో వచ్చేస్తున్నాను. నువ్వూ సాయంత్రం మద్రాసు ట్రైన్‌కి వచ్చేస్తే మనం వెళ్ళిపోవచ్చు. పెళ్ళి చేసుకొన్నాక ఇంకెవరూ ఏమీ చెయ్యే

లేరు. మా ఇంట్లో ఇక నాకు స్థానం ఉండదనుకో. కానీ, నీకన్నా వాళ్ళెక్కువ కాదు నాకు.

ఒకవేళ నువ్వుగానీ రాకపోతే, ఈ ప్రపంచంలో నా అంత దురదృష్టవంతురాలు ఇంకెవరూ ఉండరనుకొంటాను.

కానీ, నాకు నమ్మకం ఉంది. రావ్— నువ్వొస్తావని!

సాయంత్రం కలుసుకుందాం. సాయంత్రం కలుసుకోలేకపోతే— ఇక జీవితంలో కలుసుకోలేం. ఆ విషయం గుర్తుంచుకొంటావ్ కదూ.

—నీ సుప్రియ."

చాలా తొందరలో వ్రాసినట్టు గజిబిజిగా వుంది. చాలాచోట్ల కొట్టివేతలున్నాయి.

ఆసక్తికరంగా చదవటం పూర్తిచెయ్యగానే, తేదీ గురించి చూసేడు గౌరీనాథ్. పందొమ్మిది వందల తొంభైలో వాళ్ళు వ్రాసింది అది. అప్పటికి ఆ పుస్తకం ఎన్ని చేతులు మారిందో— కానీ, ఉత్తరం మాత్రం ఎవరి కంటా పడలేదు. అయిదు సంవత్సరాలపాటు ఆ కవర్ వెనక చీకట్లో వుండి, ఇన్నాళ్ళకి గౌరీనాథ్ సునిశితమైన దృష్టికి నిదర్శనంగా బయట పడింది.

ఆ క్షణంమాత్రం గౌరీనాథ్‌కి సుప్రియా, రావ్‌లమీద కోపం వచ్చింది, తమ జీవితాల్ని కలిపిన ఆ ఉత్తరాన్ని అలా పుస్తకం అట్ట వెనక వదిలేసినందుకు. ఎంత అపురూపంగా దాచుకోవలసిన ఉత్తరం అది!

ఉత్తరం ఎగిరిపోకుండా దానిమీద పేపర్ వెయిట్ పెట్టి, మళ్ళీ అనాటమీ పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకొన్నాడు. మొదటిపేజీ తిప్పగానే అదే దస్తూరితో వ్రాసి వుంది—ఎమ్. సుప్రియ, హైదరాబాద్ అని.

సైకాలజీ ప్రొఫెసర్ గౌరీనాథ్ సెన్సిటివ్ బ్రెయిన్‌కి ఎక్కడో ఏదో అపశ్రుతి పలికినట్టు అనిపించింది.

'సుప్రియ' అనే అమ్మాయి వ్రాసిన ఈ ఉత్తరం మళ్ళీ అదే అమ్మాయి అనాటమీ పుస్తకంలోనికి ఎలా వస్తుంది?

ప్రొఫెసర్ గౌరీనాథ్ బుర్ర చురుగ్గా ఆలోచించటం మొదలు పెట్టింది.

ఉన్నవి రెండు మార్గాలు. ఒకటి వాళ్ళిద్దరి వివాహం జరిగి ఉండటం, రెండవది—జరగకపోవటం.

వివాహం జరిగిందీ అనుకొంటే— ఆరోజు ఆ అమ్మాయి స్టేషన్‌కి వెళ్ళేటప్పుడు సూట్‌కేస్‌లో అంత పెద్ద పుస్తకాన్ని పెట్టుకొని వెళ్ళి ఉండదుకదా! కొన్ని నగలూ, చీరెలూ పెట్టుకొని వెళ్ళి వుంటుంది. పోనీ— రావ్‌తో పెళ్ళి జరిగేక ఆ అమ్మాయి ఇంటి పరిస్థితులు చక్క బడి, మళ్ళీ ఇంటికొచ్చి తన పుస్తకాన్ని తీసుకెళ్ళిందా అని ఆలోచిస్తే.... ఒకవేళ తీసుకెళ్ళినా, రావు ఆ ఉత్తరాన్ని అంతకాలం భద్రపరిచి ఆ అమ్మాయికిస్తే ఆమె దాన్ని ఆ పుస్తకంలో దాచింది అని ఆలోచించటం హాస్యాస్పదం....

వివాహం జరగలేదూ అనుకొంటే దానిక్కారణం ఒకటే అయి వుంటుంది- రావు స్టేషన్‌కి రాకపోయి ఉండటం! అదే నిజమైన పక్షంలో రావు దగ్గిర ఉండవలసిన పుస్తకం మళ్ళీ సుప్రియ దగ్గిరికి చేరటానికి వీల్లేదు.

మరి అసలేం జరిగి వుంటుంది.

ఆమె వ్రాసిన ఉత్తరం మళ్ళీ ఆమె పుస్తకంలోకి వచ్చింది అంటే- అది చేరవలసిన చోటుకి చేరలేదన్న మాట.

ఈ ఆలోచన రాగానే గౌరీనాథ్ కుర్చీలో నిటారుగా అయ్యేడు.

అవును. అదొక్కటే వీలుంది.

ఎంతసేపు ఆలోచించినా ఇంకోలా జరిగివుండే వీలు కనబడలేదు. ఆ ఉత్తరం రావ్‌కి చేరలేదు అంటే ఆరోజు అతను స్టేషన్‌కి వెళ్ళలేదన్న మాట. తన పుస్తకంలోనే పొరపాటున ఆ ఉత్తరాన్ని మరిచిపోయిన ఆ అమ్మాయి, ఆరోజు స్టేషన్‌లో తన స్నేహితునికోసం ఎదురు చూసీ చూసీ నిరాశచెంది వుంటుంది. రావ్‌పట్లా, ప్రేమపట్లా ఆమెకి ఆ క్షణంనుంచే

విరక్తి జనించి వుండాలి. ఆ విరక్తితోనే ఆమె మరొకరితో వివాహానికి ఒప్పుకొని వుండాలి.

ఈ విధమైన ఎనాలిసిస్‌తో సంతృప్తి చెందేరు ప్రొఫెసర్ గౌరీనాథ్. కానీ, అంతలోనే ఆయనకింకో అనుమానం వచ్చింది.

"తను వ్రాసిన ఉత్తరం తన స్నేహితునికి అందలేదూ అన్న సంగతి ఆ అమ్మాయికి తెలిసిందా? తెలిసి వుంటే—ఎప్పుడు తెలిసింది? పెళ్ళవకముందు తెలిసివుంటే—తన తప్పు తెలుసుకుని ఆ రావ్‌నే వివాహము చేసుకొని వుంటుంది. అలా కాకుండా ఇంకెవర్నో చేసుకున్నాక రావ్ ఎప్పుడో కనబడి వుంటే? కనబడి జరిగిందంతా వివరించి వుంటే? ఆ అమ్మాయి తరువాత జీవితం అంతా నరకం అయివుంటుంది. రావ్ ఆ అమ్మాయికి కనబడకుండా వుంటే కనీసం అతనిపట్ల పెంచుకొన్న ద్వేషంతోనైనా ఆమె తన సంసారంలో ఏ కలతలూ లేకుండా జీవిస్తూ వుండచ్చు. ఏం జరిగిందో ఎలా తెలుసుకోవటం?

దాదాపు అయిదు సంవత్సరాల క్రితం హైదారాబాద్‌లో మెడికల్ కాలేజీలో చదివిన ఆ సుప్రియ అనే అమ్మాయి ప్రస్తుతం ఎక్కడ వుందో, ఎవర్ని పెళ్ళిచేసుకుందో, రావ్ విషయం ఆమెకి తెలిసిందో లేదో—ఇవన్నీ జవాబులేని ప్రశ్నలుగా మిగిలిపోయేయి గౌరీనాథ్‌కి. కాలక్రమేణా ఈ విషయాన్ని మరిచిపోయేడు కూడా.

ఇంతటితో ఈ కథ ఆగిపోవలసిందే. కానీ, ఒక రోజు....

★ ★ ★ ★

"కూర్చో మాధవ్" అన్నాడు గౌరీనాథ్. మాధవరావు కూర్చోలేదు.

"చెప్పండి, సార్. మీరెన్నాళ్ళనుంచో తప్పించుకొంటున్నారు. ఈ రోజు అన్నీ అరేంజ్ చెయ్యమని ఇంట్లో చెప్పి వచ్చేను. ఏమైనా ఈరోజు రాత్రికి మా ఇంటికి డిన్నర్‌కి రావలసిందే" అన్నాడు.

"వస్తాను. కానీ, ఈరోజు కాదు"

"అదేం లాభంలేదు. ఎన్నాళ్ళనుంచో మీరు అలాగే చెబుతున్నారు. ఈరోజు మిమ్మల్ని వదిలిపెట్టను"

గౌరీనాథ్ ఇబ్బందిగా కుర్చీలో కదిలి, "సరే, అయితే నీ ప్రోగ్రామ్ రేపటికి మార్చుకో. ఈ రోజు సాయంత్రం నాకొ్కద్దిగా పనుంది" అన్నాడు.

మాధవ్ మొహం సంతోషంతో విప్పారింది.

"ఇంటికి ఫోన్‌చేసి చెబుతాను సార్ రేపటికి పోస్ట్ పోన్ చెయ్యమని" అంటూ ఫోన్ ఎత్తి డయల్‌చేసి, 'హలో సుప్రియా' అన్నాడు.

టేబిల్‌మీద కాగితాలు సర్దుతున్న ప్రొఫెసర్ చేతులు హఠాత్తుగా ఆగిపోయేయి. సుప్రియ....సుప్రియ అంటూ మనసులోనే మననం చేసుకొన్నాడు. మాధవ్ మాట్లాడటం పూర్తిచేసేవరకూ అతనివైపే ఆత్రుతగా చూడసాగేడు....మనసులో అస్పష్టమైన ఆలోచనల కదలికలు-'సుప్రియ' అనే పేరు సాధారణంగా ఎక్కువమందికి వుండదు. తన ప్రియాతి ప్రియమైన శిష్యుడి భార్యగానీ. ఆ అమ్మాయి అయితే?....ఇతని దాంపత్య జీవితం ఎలా సాగుతూంది?

గౌరీనాథ్ ఆలోచనలనుంచి తేరుకోకముందే మాధవ్ ఫోన్ పెట్టేస్తూ "ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్నాడు.

"అబ్బే—ఏంలేదు—ఇంటికేనా ఫోన్ చేసింది?" కలవరపాటును అణుచుకొంటూ అడిగేడు గౌరీనాథ్.

"అవునండీ. వచ్చేముందు చెప్పేను, ఈరోజు ఎలాగైనా మిమ్మల్ని డిన్నర్‌కి తీసుకొస్తానని. అందుకని...."

"మీ ఇంట్లో ఫోన్ వుందా?"

"తను డాక్టర్ కదండీ? ఫోన్ లేకపోతే ఎలా?" నవ్వేడు. బల్లఅంచుమీద గౌరీనాథ్ చెయ్యి బిగుసుకుంది.

* * * *

ప్రొఫెసర్ గౌరీనాథ్ కారు మాధవ్ ఇంటి కాంపౌండ్‌లోకి ప్రవేశించేసరికి ఆరున్నర అయింది. వేసవికాలం అవటం వలన ఇంకా చీకటి

పడలేదు. ఆయన కారు దిగుతూ వుంటే, అప్పటివరకూ ఆయన కోసమే చూస్తున్నట్టు మాధవ్ గబగబా దగ్గరకొచ్చేడు.

కారు దిగుతున్నప్పుడే గౌరీనాథ్ తీక్షణమైన కళ్ళు అన్నివైపులా వెతికేయి.

"ఇక్కడే బయట కూర్చుందాం సార్. లోపల మరీ సఫ్రోకేటింగ్‌గా వుంటుంది" అన్న మాటలకు మౌనంగానే తల వూపేడు గౌరీనాథ్.

ఇంటి చుట్టూ చిన్న గార్డెన్ పొందికగా వుంది. సన్నగా వీచే గాలికి మల్లెపందిరి మీద నుంచి వచ్చే సువాసన సేద తీరుస్తూంది. కుండీల్లో వున్న క్రోటన్ మొక్కల్ని చూస్తూంటే ఆ ఇంట్లో వున్నవాళ్ళకి గార్డెనింగ్ అంటే చాలా ఇష్టమని తెలిస్తుంది. ఆ మొక్కలమధ్య మూడు కుర్చీలూ, టీపాయీ అమర్చారు. ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు.

"మీ ఇల్లు చాలా బాగుందోయ్" మెచ్చుకోలుగా అన్నాడు గౌరీనాథ్. మాధవ్ నవ్వి "ఇందులో నాదేమీ లేదండీ. అంతా ప్రియే చూసుకొంటూంది. నాకు నా ఆఫీస్‌తోనే సరిపోతుంది" అన్నాడు.

ఇంకేదో అడగబోతూన్న గౌరీనాథ్ చటుక్కున మాటలు ఆపుచేసి ఇంటివైపు చూసేడు. తెల్లటి, పాము కుబుసంలాంటి చీరెలో-కడిగిన ముత్యంలా, మంచులో తడిసిన మల్లెలా ఉన్న సుప్రియ నెమ్మదిగా నడుస్తూ అక్కడికొచ్చింది. ఏమీ అలంకారాలు లేకపోయినా, ఆ అమ్మాయి ఎంతో హుందాగా వుంది. ఆమె ముఖంలో విజ్ఞానం తొణికిసలాడుతూ వుంది.

"నా భార్య సుప్రియ" అంటూ పరిచయం చేసేడు. గౌరీనాథ్ నమస్కారం చేస్తూ ఆమె కళ్ళలోకి సూటిగా చూసేడు. చాలా ప్రశాంతంగా వున్నాయి అవి. కానీ, గౌరీనాథ్ సునిశితమైన దృష్టి ఆమె కళ్ళ వెనుక అస్పష్టంగా గూడుకట్టుకున్న నీలి నీడల్ని వెంటనే గమనించింది.

"ఈయన మా ప్రొఫెసర్. ఇన్నాళ్ళకి మనింటికి డిన్నర్‌కి రావటానికి ఒప్పుకొన్నారు" అన్నాడు మాధవ్.

"అబ్బే. అదేంలేదు. ఏదో టైమ్ దొరక్క...." అంటూన్న గౌరీనాథ్‌ని మధ్యలో ఆపుచేస్తూ "మీ ఆర్టికల్స్ నేనూ ఇంటరెస్టింగ్‌గా చదువుతూ వుంటానండీ. ముఖ్యంగా మనష్యుల బలహీనతల మీదా, 'ఈగో' మీదా మొన్న మీరు వ్రాసిన వ్యాసం చాలా బాగుంది" అంది మెచ్చుకోలుగా. ఊహించని ఆ పొగడ్తకి తబ్బిబ్బయి బట్టతలని తడుముకొంటూ నవ్వేడు కృతజ్ఞతగా.

ఆ తరువాత కొద్దిసేపు ముగ్గురూ ఇండస్ట్రియల్ అన్‌రెస్ట్ గురించీ, లేబర్ సైకాలజీ గురించీ మాట్లాడుకున్నారు. మాధవ్ కూడా సైకాలజీ స్టూడెంట్ అవటంవల్ల సంభాషణ ఎక్కువ భాగం దానిమీదే సాగింది. పైకి వాళ్ళతో మాట్లాడుతున్నా, ప్రతిక్షణం గౌరీనాథ్ ఆ అమ్మాయిని గమనిస్తూనే వున్నాడు.

"మీరు తొందరగా భోజనం చేస్తారా-ఇంకా చీకటి పడాలా?" అడిగేడు మాధవ్.

"తొందరలేదు" అన్నాడు గౌరీనాథ్—మాధవ్ భార్యతో ఏదో అన్నాడు. ఆమె లేచి లోపలికి వెళ్ళింది. గౌరీనాథ్ మళ్ళీ ఆలోచనలోకి జారుకున్నాడు. ఆమెలో ఎక్కడో అస్పష్టమైన అసంతృప్తి కనిపిస్తోంది. ఎక్కడ?

ప్రేమించినవాణ్ణి పొందలేకా?

ప్రేమించినవాడు మోసం చేసేడనే కసివల్లా?

విధి చేసిన మోసంపట్ల వేదనవల్లా?

ఎలా? ఎలా తెలుసుకోవటం?? ఈ రకమైన ఆలోచనలతో ఆయన తల వేడెక్కిపోయింది. ఆయన ఏభై సంవత్సరాల వయసులో ఎప్పుడూ ఇంత సీరియస్ ప్రోబ్లమ్ ఆయనకి తగల్లేదు. ఈ ఆలోచనలలోనే ఆయన, సుప్రియ మూడు గ్లాసులలో నిమ్మరసం పట్టుకొచ్చి ఇవ్వబోవటం గమనించలేదు—

"ఈ రోజు మీరెందుకో అన్యమనస్కంగా వున్నారు" అన్న మాధవ్ మాటలతో ఈ లోకంలోకి వచ్చేడు.

"ఏం లేదు" అంటూ ట్రేలోంచి గ్లాసు అందుకోబోతూ వుంటే ఆయనకి ఫ్లాష్‌లాంటి ఆలోచన వచ్చింది. ఆ ఐడియా రాగానే ఆయన మొహంలో ఒక్కసారిగా అప్పటివరకూ వున్న సందిగ్ధత మాయమై పోయింది. 'లింక్' దొరకగానే రెండు క్షణాల్లో మిగతా కథ అల్లుకుపోయి రంగం సిద్ధం చేసుకొన్నాడు.

తనూ ఓ గ్లాసు తీసుకొని కూర్చుంటూ, "కాదండీ— మీరు ఏదో అన్యమనస్కంగా వున్నారు...." అంటూ భర్తని సమర్థించింది సుప్రియ.

ప్రొఫెసర్ ఒక్క క్షణం తదేకంగా శూన్యంలోకి చూసేడు. తరువాత గాఢంగా నిశ్వశిస్తూ ఆ దంపతులవైపు చూసి "ఈ రోజు నాకెందుకో మా బాబాయ్ కొడుకు మాటి మాటికీ జ్ఞాపకం వస్తున్నాడు" అన్నాడు. ఇద్దరూ ఆయనవైపు ప్రశ్నార్థకంగా చూసేరు.

"అవును" భారంగా అన్నాడాయన. "ఒక అమ్మాయిని ప్రేమించిన నేరానికి- ఒక అమ్మాయితో జీవితాన్ని పంచుకుందామనుకున్న నేరానికి అన్యాయంగా తన జీవితాన్ని బలి చేసుకొన్నాడు. స్త్రీలు పురుషుల్ని ఎంత అందంగా మోసం చెయ్యగలరో తెలుసుకోలేని అమాయకుడు."

ఆయనింకా వాక్యం పూర్తి చేయకముందే సుప్రియ అందుకొని "మీరిలా పూర్తిగా ఆడవాళ్ళని జనరలైజ్ చేయకండి. ఆ మాటకొస్తే అమాయకులయిన అమ్మాయిల్ని ప్రేమలోకి దింపి, ఆపై ఏమీ తెలియనట్టు తప్పుకునే మగవాళ్ళే ఎక్కువ ఈ ప్రపంచంలో...." అంది. ఎర్రటి సంధ్యలో ఆమె మొహం ఆవేశం వల్ల మరింత ఎర్రగా కనిపించింది.

గౌరీనాథ్ ఆమెను అనునయిస్తున్నట్లు "మీరు చెప్పింది నిజమైతే నిజమై వుండవచ్చు. కానీ మా వాడు బ్రిలియంట్. జీవితంలో ఎంతో

పైకి రావలసినవాడు. అటువంటిది ఒక అమ్మాయి అతన్ని గాఢంగా మోసం చేసింది. దానితో రోజు రోజుకీ కృంగిపోయి, మూణ్నెల్ల క్రితం చచ్చిపోయేడు. ఇంకో రకంగా చెప్పాలంటే, ఆత్మహత్య చేసుకున్నాడు దాదాపు" అన్నాడు.

"అవును మాష్టారూ! ఈ ఆడవాళ్ళని అసలు నమ్మకూడదు. ముఖ్యంగా మెడికోల్ని...." అన్నాడు మాధవ్ భార్యవైపు చిలిపిగా చూస్తూ.

"ఏమిటి మీ ఉద్దేశ్యం?" అంది సుప్రియ కోపంగా.

"మాధవ్ యథాలాపంగా అన్నా, మా రావ్ విషయంలో అది నిజమే. ఎందుకంటే, రావ్ ప్రేమించింది కూడా మెడికోనే" అన్నాడు గౌరీనాథ్. 'రావ్'అంటున్నప్పుడు సుప్రియ శరీరం కొద్దిగా కంపించటం ఆ మసక చీకట్లో అస్పష్టంగా ఆయనకి కనిపించింది. రావ్‌కి వ్రాసిన ఉత్తరం అతనికి చేరలేదనేది ఇంతవరకూ సుప్రియకి తెలియలేదనీ, ఆమె ఇంకా అతను తనని మోసం చేసేడనే అనుకుంటోందనీ గౌరీనాథ్‌కి నిశ్చయంగా తెలిసిపోయింది. ఎందుకంటే, ఒకవేళ ఆమెకి మాధవ్‌తో వివాహం జరిగిపోయాక రావ్‌గానీ కనబడి జరిగినదంతా చెప్పేసి వుంటే ఆమెకి పురుషుల మీద ఇంత కోపం వుండటానికి వీల్లేదు. జరిగినదంతా తెలిస్తే, ఆమెకి పురుషుల మీద వున్న కోపం, విధి చేసిన మోసంపట్ల వేదనగా మారుతుంది. విధి తనపట్ల ఎంత కఠోరంగా ప్రవర్తించిందీ ఈ అమ్మాయి తెలుసుకుంటే ఏమవుతుంది? ఆ షాక్ నుంచి తట్టుకోగలదా? అప్పటి వరకూ రావ్ పట్ల వున్న కోపం అంతా ఒక్క క్షణంలో అతని పట్ల జాలిగా మారటం— ఒక పేజ్‌లోంచి ఇంకో పేజ్ లోకి మనిషి ట్రాన్స్‌ఫార్మేషన్— జాగ్రత్తగా పరిశీలించి చూస్తే ఒక సైకాలజిస్ట్‌గా తన మెదడు కెంత మేత !

"ఏ ఊరు? ఈ ఊరేనా?" అడిగేడు మాధవ్.

"అవును. అతని చదువు అప్పటికే పూర్తయింది. ఆ అమ్మాయి ఫోర్త్ ఇయర్‌లోనో ఎక్కడో వుందనుకొంటా— నాకు సరీగ్గా తెలీదు.

ఇద్దరూ చాలా గాఢంగా ప్రేమించుకున్నారు. ఆ అమ్మాయి గురించి నాకు అప్పుడప్పుడు చెబుతూ వుండేవాడు. నా దగ్గిర బాగా చనువు వాడికి. ఇంతలో వున్నట్టుండి ఆ అమ్మాయికి పెళ్ళయిపోయింది. కనీసం వీడితో చూచాయగా కూడా చెప్పలేదు. అసలేం జరిగిందో అతనికి తెలిసేసరికి రెండు నెలలు పట్టింది. ఆ అమ్మాయి తననెందుకు అంత మోసంచేసిందో తనేం తప్పుచేసేడో అర్థంకాలేదు. ఆ షాక్‌నుంచి అతను తప్పించుకోలేక పోయాడు. నేనెంతో చెప్పిచూసేను. కానీ, ఆమెని అతను ఎంత గాఢంగా ప్రేమించాడో, పాపం—నా మాటలు అతనిమీద ఏమీ ప్రభావం కలిగించ లేకపోయేయి. రోజు రోజుకీ కృశించిపోసాగేడు, చివరికి టైఫాయిడ్ వచ్చి చచ్చిపోయేడు. కానీ, నిజంగా అతనే కారణంవల్ల చనిపోయాడో నా ఒక్కడికే తెలుసు" గంభీరంగా అన్నా, గౌరీనాథ్ కంఠంలో విషాదం ధ్వనిస్తూనే వుంది.

అంతా నిశ్శబ్దంగా వుంది. బాగా చీకటిపడింది. సన్నగా వీచే గాలికి చెట్ల ఆకులు నెమ్మదిగా కదులుతున్నాయి.

ఎవరూ మాట్లాడటం లేదు.

చేతులు రెండూ ఒడిలో పెట్టుకొని తల బాగా క్రిందికి వంచుకొని కూర్చుంది సుప్రియ. వెలుతురు బాగా తక్కువ అవటంవల్ల ఆమె మొహంలో కదులుతూన్న భావాల్ని స్పష్టంగా చదవలేకపోయేడు గౌరీ నాథ్. ఆమె మనసులో ఎంత కల్లోలం చెల రేగుతూందో, ఉద్వేగాన్ని ఆపుకోవటానికి ఆమె ఎంత ప్రయత్నిస్తూందో- ఆమె కూర్చున్న భంగిమే చెబుతోంది.

"ఏమిటంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావ్?" అన్నాడు మాధవ్ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ. సుప్రియ మాట్లాడలేదు మాట్లాడితే తన కంఠంలో గాద్గదికత ఎక్కడ తనని పట్టిచ్చేస్తుందో అన్న భయంతో కాబోలు....

మాధవ్ గౌరీనాథ్ వైపు తిరిగి "తను డాక్టర్ అన్న మాటేగానీ, చాలా సెన్సిటివ్ అండీ" అన్నాడు వివులీకరిస్తున్నట్టుగా.

గౌరీనాథ్‌కి అకస్మాత్తుగా తను చేసిన తప్పు బోధపడింది. తను ప్లే చేసిన ట్రిక్ వల్ల ఈ అమ్మాయి జీవితంలో ఆనందం అనేది పూర్తిగా లేకుండా చేసేడు. తనను ప్రేమించిన నేరానికి జీవితాన్ని బలి చేసుకొన్న ఆ రావ్ ప్రతి నిమిషమూ ఆమెకి గుర్తువచ్చి బాధ పెడతాడు. తను అనాలోచితంగా చేసిన ఈ ట్రిక్ వల్ల ఇటు ఆమె జీవితమూ, అటు మాధవ్ జీవితమూ నరకప్రాయం కాబోతున్నాయి-

గౌరీనాథ్ ఆలోచనల్లో వుండగానే మాధవ్ లేచి, "ఇప్పుడే వస్తాను" అంటూ ఇంటివైపు వెళ్ళేడు. గౌరీనాథ్ సుప్రియవైపు చూసేడు. ఆమె కూడా తల ఎత్తి ఆయనవైపు చూసింది. లోపల మాధవ్ స్విచ్ వేసినట్టున్నాడు-తోటలో లైటు వెలిగింది. ఆ వెలుతురులో ఆమె మొహం తెల్లగా పాలిపోయినట్టు ఆయనకి కనిపించింది- తను చేసిన తప్పు సరిదిద్దుకోవటానికి ఇంకో అబద్ధం ఆడటానికి నిశ్చయించుకొని "నన్ను క్షమించండి" అన్నాడు.

"ఎందుకు" అంది సుప్రియ ఆశ్చర్యంగా.

"రావ్ చచ్చిపోలేదు. బ్రతికే వున్నాడు. అంతేకాదు- శుభ్రంగా పెళ్ళి చేసుకొని సంసారం చేస్తున్నాడు."

సుప్రియ ఆయనవైపు మరింత ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి చూసింది.

"అవును! నేను అబద్ధం చెప్పేను. ఆ రోజుల్లో మిమ్మల్ని రావ్ గాఢంగా ప్రేమించి వుండవచ్చు. కానీ, అకారణంగా మీరు అతన్ని తిరస్కరించేరు."

"మీరు చెపుతోంది...."

"మీ గురించే, సుప్రియాదేవీ....మీరు చదువుకునే రోజుల్లో రావ్‌ని ప్రేమించలేదూ?" సూటిగా ప్రశ్నించాడు.

ఆయన చెబుతోంది నిజమే అన్నట్టు తల ఊపింది.

"కానీ, మీరు అకస్మాత్తుగా అతనితో పరిచయం తెంచేసుకొనే సరికి...."

"నేనేమీ అకారణంగా...." అనబోతున్న సుప్రియ చటుక్కున మాటలు ఆపుచేసింది. మాధవ్ అక్కడికి వచ్చి "డిన్నర్‌కి అన్నీ అరేంజ్ చేసెయ్యమని చెప్పనా....ఇంకా ఆలస్యం వుందా....?" అని అడిగేడు. సుప్రియ లేవబోయింది.

"ఇంకో అరగంట పోయాక చేద్దాం" అన్నాడు గౌరీనాథ్.

భార్యని వారిస్తూ, "నువ్వు మాట్లాడుతూ వుండు, నేను చెప్పేసి వస్తాను" అంటూ లోపలికి వెళ్ళేడు మాధవ్.

తిరిగి సంభాషణ కొనసాగిస్తూ, "మీరు అకారణంగా రావ్‌ని తిరస్కరించలేదు. ఒక రకంగా చెప్పాలంటే, మీ వాళ్ళందర్నీ వదిలేసి వచ్చేసి అతన్ని పెళ్ళి చేసుకుందామని అనుకున్నారు ఆ రోజుల్లో, అవునా?" అన్నాడు గౌరీనాథ్.

"ఇవన్నీ....మీకెలా....?" అనబోతున్న సుప్రియని మధ్యలో ఆపు చేసి, "తెలుసు! అంతేకాదు— రావుకూడా మిమ్మల్ని అంతే గాఢంగా ప్రేమించాడన్న విషయం కూడా నాకు తెలుసు. కానీ, అతను మిమ్మల్ని చేసుకోలేక పోవటానికి కారణం మీరు ఊహిస్తున్నది మాత్రం కాదు. దానిక్కారణం నాకే- ఇంకోలా చెప్పాలంటే నా ఒక్కడికే తెలుసు" ఆయన కంఠం ఆవేశంతో కంపించింది.

"మీరు చెపుతోంది...." అర్థోక్తిలోనే ఆపుచేసింది.

"చెబుతాను. కానీ, మీరు నాకో వాగ్దానం ఇవ్వాలి. విధి మీ ఇద్దరి పట్లా చాలా చిన్నచూపు చూసింది. ఇదంతా తెలిసిన తరువాత మీరు కృంగిపోకూడదు, ముఖ్యంగా మాధవ్‌ని ఏమీ బాధపెట్టకూడదు" అని క్షణం ఆగి, "మీరు రావ్‌కి ఒక ఉత్తరం వ్రాసేరు కదూ- పెళ్ళి చేసుకొమ్మని ఇంట్లో ఒత్తిడి చేస్తున్నారని, అ రోజు రాత్రి స్టేషన్‌కి వస్తే...." అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు.

సుప్రియ చప్పున "అవును, వ్రాసేను" అంది.

గౌరీనాథ్ కంఠంలో అకస్మాత్తుగా విషాదం ధ్వనించింది. "మీరు వ్రాసిన ఉత్తరం రావ్ వరకూ చేరలేదు సుప్రియాదేవీ! అది మీ అనాటమీ పుస్తకం అట్ట వెనుక చీకట్లో సమాధి అయిపోయింది. మీ జీవితం అందంగా మలుపు తిరగవలసిన చోట మీరు కొద్దిగా నిర్లక్ష్యం చూపటం వల్ల విధి మీపట్ల చాలా కర్కశంగా పగ తీర్చుకుంది. మీ గురించీ, మీ ఆకస్మిక మౌనం గురించీ రావ్ ఎంత తల్లడిల్లి పోయేడో, పాపం" అంటూ ఆగి, ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ వుందేమో అని చూసేడు.

ఆమె చలనం లేకుండా అలానే వుండిపోయింది. ఆమె మొహంలో విషాదం కూడా కనబడటంలేదు. 'షాక్ వేదనకన్నా భయంకరమైనది' అనుకున్నాడు. ఇప్పు డామెని ఆ షాక్ నుంచి బయటికి తీసుకురావలసిన బాధ్యత తన మీదే వుంది. మనస్తత్వ శాస్త్రంలో తను ఇన్నాళ్ళూ జరిపిన పరిశోధనా సారాన్ని ఇప్పుడు వుపయోగించి ఆమెని మామూలు మనిషిని చెయ్యాలి.

గౌరీనాథ్ ఆలోచనల్లో వుండగానే ఆమె కొద్దిగా తేరుకొని, "మీకా పుస్తకం ఎక్కడ దొరికింది?" అని అడిగింది.

"విధి ఎంత చిత్రంగా వుంటుందో చూడండీ. మా తమ్ముడికోసం సెకండ్‌హాండ్ షాపులో కొన్నాన్నేను. ప్రతి విషయాన్నీ సున్నితంగా అబ్జర్వ్ చెయ్యటం మా సైకాలజిస్టులకి వెన్నతో బెట్టినవిద్య. దానికి నిదర్శనంగా—దాదాపు అయిదు సంవత్సరాలు చీకట్లో వున్న ఉత్తరం ఇలా బయట పడింది."

ఒక క్షణం నెమ్మదిగా గడిచింది. బాగా చీకట్లు అలుముకున్నాయి. వరండాలో వున్న లైటు కాంతి చెట్లమీద ప్రతిబింబిస్తూంది. సన్నగా వీచే గాలికి నేలమీద చెట్లనీడలు కదులుతున్నాయి. దూరంగా ఎవరో కుర్రాడు గొంతెత్తి 'చందమామా, నిజం చూడకూ....' అని పాడుకుంటూ పోతున్నాడు.

ఆ నిమేషమాత్రపు నిశ్శబ్దాన్ని కూడా గౌరీనాథ్ భరించలేక పోయేడు. అనునయిస్తున్నట్టు "చూడండి సుప్రియాదేవీ, విధి చేతిలో

మనం కీలుబొమ్మలం. మీరు అనవసరమైన ఆలోచనలతో మనసు పాడు చేసుకోకండి.... ముఖ్యంగా ఆ రావ్ గురించి" అంటూ ఏదో చెప్పబోతున్న గౌరీనాథ్‌ని మధ్యలో ఆపుచేస్తూ "అబ్బే, నేను ఆలోచిస్తున్నది అది కాదు. ఆ ఉత్తరం గురించి" అని క్షణం ఆగి, ఏదో గుర్తు తెచ్చుకుంటున్నట్టు తనలో తనే, "పెయిర్ వ్రాసేక ఆ చిత్తు కాపీని చింపేసినట్టు నాకు బాగా గుర్తే" అంది.

గౌరీనాథ్ కళ్ళముందు ఏదో మెరిసినట్టయింది. చుట్టూ వున్న వస్తువులు గిర్రున తిరగనారంభించేయి. ఎదురుగా వున్న అమ్మాయి పది మంది సుప్రియలుగా కనిపించసాగేరు. మొహం తెల్లగా పాలిపోయింది. అస్పష్టంగా 'ఏమిటీ' అంటూ గొణిగేడు.

ఈ లోపులో సుప్రియ బాగా రిలాక్సయింది. చిరునవ్వుతో "పాపం ఆ ఉత్తరం మిమ్మల్ని చాలా బాధ పెట్టినట్టు వుందే" అంది.

గౌరీనాథ్ ఇంకా ఆ షాక్‌నుంచి తేరుకోనట్టు ఏమీ మాట్లాడలేదు. అంతలో మాధవ్ అక్కడి కొచ్చేడు.

సుప్రియ నవ్వుతూన్నట్టు "ఇప్పుడు చెప్పు, రావ్, ఏమిటి మెడికోల గురించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నావ్?" అంది.

భార్యవైపు విచిత్రంగా చూసి, గౌరీనాథ్ వైపు తిరుగుతూ "ఏమిటి గురూగారూ, తన సైకాలజీ మీద ఏమైనా ప్రయోగం చేసేరేమిటి-ఇన్నాళ్ళకి పేరుపెట్టి పిలుస్తూంది" అన్నాడు మాధవరావు.

— ★ —